RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 93 | ఏప్రిల్ 23 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 93 | April 23 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


హైకోర్టు తీర్పును అనుకూలంగా మార్చుకోవాలని చూడటం హాస్యాస్పదం 2

### ఆర్టీసీ సమ్మెతో స్తంభించిన

# ప్రజా రవాణా

## డిపోలకే పరిమితమైన బస్సులు, ప్రయాణికుల అగచాట్లు



హైదరాబాద్ జనసంఘర్షణ
తెలంగాణ వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెతో రాష్ట్రంలో రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు సమ్మె బాట పట్టారు, దీంతో బుధవారం ఉదయం నుంచి వేలాది బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. పెద్దపల్లి, మహబూబ్‌నగర్, సిద్దిపేట వంటి జిల్లాల్లో బస్సులు బయటకు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో నిత్యం బస్సులపై ఆధారపడే లక్షలాది మంది జనం ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదే అదనుగా ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేయడంతో సామాన్యులపై అదనపు భారం పడింది. ప్రయాణికుల రద్దీని తట్టుకోవడానికి హైదరాబాద్ మెట్రో అధికారులు రైళ్ల సంఖ్యను 56కు పెంచడమే కాకుండా, రాత్రి వేళ సర్వీసు సమయాన్ని కూడా పొడిగించారు. మెట్రో స్టేషన్లన్నీ ప్రయాణికులతో

# నేడు కేబినేట్ భేటీ



హైదరాబాద్ జనసంఘర్షణ
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో ఇటీవల తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన నేపథ్యంలో, ఈ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకోర్టు తీర్పును లోతుగా విశ్లేషించి, ప్రాజెక్టు అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగుల గురించి ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ముఖ్యంగా న్యాయపరమైన అంశాలను అధిగమిస్తూ విచారణను

➤ మిగతా 2వ పేజిలో..

### కాళేశ్వరం అవినీతిపై

## వెనక్కి తగ్గేది లేదు

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజం 2

# మాజీ సీఎం నాదేండ్ల మృతి

### నెల రోజుల పాటు ఆ పదవిలో కొనసాగిన వైనం



హైదరాబాద్ జనసంఘర్షణ
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. 90 ఏళ్ల వయసున్న నాదెండ్ల భాస్కరరావు మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ మరియు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా సాగింది. 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, ఆ తర్వాత 1989 వరకు శాసనసభలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా 1980వ దశకంలో

➤ మిగతా 2వ పేజిలో..

# అన్ని మతాలను ఒకే గాటన కట్టలేం

### కీలకమైన వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ జనసంఘర్షణ
మతపరమైన విశ్వాసాలు మరియు రాజ్యాంగపరమైన హక్కుల మధ్య ఉన్న సంబంధంపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంతో పాటు మసీదుల్లోకి మహిళల అనుమతి, పార్శీ మహిళల హక్కులు వంటి సున్నితమైన అంశాలపై జరుగుతున్న విచారణలో భాగంగా, అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టడం సాధ్యం కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. మత స్వేచ్ఛ

➤ మిగతా 2వ పేజిలో..

# కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్ జనసంఘర్షణ
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు గట్టి చెంపపెట్టు అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభివర్ణించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు వెలువరించిన నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారం తప్పని తేలిపోయిందని, అది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు

➤ మిగతా 2వ పేజిలో..

# సీజ్‌ఫైర్ నిరవధికంగా పొడగింపు

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన



న్యూఢిల్లీ జనసంఘర్షణ
అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో కాల్పుల విరమణను (సీజ్‌ఫైర్) నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ పరిణామంతో ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన శాంతి చర్చల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన పాకిస్థాన్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు వైట్‌హౌస్ అధికారికంగా ధ్రువీకరించింది. ఇరాన్ ప్రతినిధులతో ఒక ఒప్పందానికి వచ్చేందుకు వాన్స్ ఈ నెలలో

➤ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
23 గురువారం, ఏప్రిల్ 2026

## ఆర్టీసీ సమ్మెతో స్తంభించిన ప్రజా రవాణా

**మొదటిపేజీ తరువాయి..** కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లతో అద్దె బస్సులను నడిపించే ప్రయత్నం చేసింది. అయితే, ఈ క్రమంలో కరీంనగర్‌లోని కోతిరాంపూర్ బైపాస్ వద్ద ఒక అద్దె బస్సు లారీని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడపడం వల్లే ఇలా జరిగిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పందిస్తూ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొన్ని సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపబోమని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తుండగా, ప్రయాణికుల క్షేమం దృష్ట్యా సమ్మె విరమించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన ఈ నిరసనలతో రాష్ట్రవ్యాప్తంగా రహదారులు బస్సులు లేక వెలవెలబోతున్నాయి.

# నేడు కేబినేట్ భేటీ

**మొదటిపేజీ తరువాయి..** ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎలాంటి క్లీన్ చిట్ లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్, హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు మరియు తదుపరి విచారణ ప్రక్రియకు ఈ కేబినెట్ సమావేశం ఒక స్పష్టమైన దిశను చూపే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

# అన్ని మతాలను ఒకే గాటన కట్టలేం

**మొదటిపేజీ తరువాయి..** సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, సదరు ఆచారాల వెనుక ఉన్న చారిత్రక నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక మతంలోని నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాలకు సార్వత్రికంగా వర్తింపజేయలేమని కోర్టు పేర్కొంది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు లభించే మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, సామాజిక మార్పు కోసం ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి కఠినమైన మార్గదర్శకాలను విధించలేమని ధర్మాసనం వివరించింది. ఇలాంటి ఉమ్మడి నిబంధనలు విధిస్తే భవిష్యత్తులో వచ్చే వివిధ రకాల కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా అనే ప్రాథమిక ప్రశ్నపై ఏడో రోజు విచారణ సాగింది. మతపరమైన వ్యవహారాల్లో న్యాయవ్యవస్థ మరియు ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తున్న ఈ విచారణ, భారతదేశంలోని వివిధ మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. శబరిమల తీర్పు పునఃసమీక్ష నేపథ్యంలో వెలువడనున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

# మాజీ సీఎం నాదేండ్ల మృతి

**మొదటిపేజీ తరువాయి..** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా, పార్టీ స్థాపనలో కీలక వ్యూహకర్తగా వ్యవహరించారు. అయితే, అనంతర కాలంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల వల్ల 1984 ఆగస్టు 16న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, సరిగ్గా ఒక నెల రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. స్వల్పకాలమే సిఎంగా ఉన్నప్పటికీ, మంత్రిగా మరియు ప్రజాప్రతినిధిగా ఆయనకు పరిపాలనపై ఉన్న పట్టు, చట్టసభల పనితీరుపై ఆయనకున్న అపారమైన అవగాహన ఎంతో మంది యువ నేతలకు మార్గదర్శకంగా నిలిచింది. ఆయన మృతిపై ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ స్పందిస్తూ.. నాదెండ్ల భాస్కరరావు మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎంతోమందికి ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శిని కోల్పోయామని, ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. నాదెండ్ల కుమారుడు, ప్రస్తుతం ఏపీ మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్‌కు మరియు వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని ప్రకటించారు. గుంటూరు జిల్లా నుంచి ప్రారంభమై జాతీయ స్థాయి వరకు సాగిన ఆయన రాజకీయ ప్రస్థానం ముగియడం పట్ల తెలుగు రాష్ట్రాల నేతలు నివాళులర్పిస్తున్నారు.

## కాళేశ్వరం అవినీతిపై వెనక్కి తగ్గేది లేదు: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజం

హైదరాబాద్
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న హడావుడిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, హైకోర్టు తీర్పును తప్పుగా అర్థం చేసుకుని సంబరాలు చేసుకోవడం బీఆర్ఎస్ నేతల అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ తీర్పు ఎక్కడా కూడా గత ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇవ్వలేదని, కేవలం కొందరికి నోటీసులు ఇవ్వని సాంకేతిక అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం కథ ఇంకా ముగియలేదని, సీబీఐ విచారణ కోరడానికి ఈ తీర్పు ఏమాత్రం అడ్డంకి కాదని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ నివేదికను కానీ, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కానీ కోర్టు కొట్టివేయలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు కళ్లముందే కుప్పకూలిపోతుంటే, కమీషన్ల కక్కుర్తి వల్ల జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మహేశ్ గౌడ్ ఆరోపించారు. గతంలో ఇదే ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్నారని విమర్శించిన అమిత్ షా, జేపీ నడ్డా వంటి బీజేపీ అగ్రనేతలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. కేంద్ర సంస్థ అయిన ఎన్‌డీఎస్‌ఏ కూడా నిర్మాణ లోపాలను ఎత్తిచూపిందని, మరి దీనిపై కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును ప్రభుత్వం పూర్తిగా అధ్యయనం చేస్తోందని, త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఎన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేసినా, లక్ష కోట్ల వృథాకు కారణమైన దోషులు చట్టం నుండి తప్పించుకోలేరని, వారు జైలుకు వెళ్లడం ఖాయమని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు.

# సీజ్‌ఫైర్ నిరవధికంగా పొడగింపు

**మొదటిపేజీ తరువాయి..** రెండోసారి పాక్ వెళ్లాల్సి ఉంది, అయితే సీజ్‌ఫైర్ పొడిగింపు నిర్ణయంతో ప్రస్తుతానికి ఆ పర్యటన అవసరం లేదని భావించి నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఏవైనా వ్యక్తిగత భేటీలు ఉంటే వాటి గురించి ముందు ముందు ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మనస్ఫూర్తిగా స్వాగతించారు. తమ అభ్యర్థనను మన్నించి కాల్పుల విరమణను పొడిగించినందుకు ట్రంప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల దౌత్యపరమైన చర్చలు కొనసాగేందుకు అవకాశం ఉంటుందని, పాకిస్థాన్‌పై అమెరికా ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌తో ఉన్న సమస్యలను శాంతియుత మార్గంలో పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తూనే ఉంటామని, త్వరలోనే ఇరు దేశాల మధ్య ఒక సమగ్రమైన శాంతి ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నట్లు షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

మరోవైపు ఐక్యరాజ్యసమితి (ఖచీ) కూడా ఈ పరిణామాన్ని సానుకూల సంకేతంగా అభివర్ణించింది. సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తరపున ప్రతినిధి స్టీఫానే డుజారిక్ మాట్లాడుతూ.. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇది ఒక గొప్ప అడుగు అని కొనియాడారు. దీనివల్ల అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర విశ్వాసం పెరుగుతుందని, ఇరు పక్షాలు సీజ్‌ఫైర్‌ను ఉల్లంఘించకుండా చర్చలను నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ శాంతి ప్రక్రియలో పాకిస్థాన్ పోషిస్తున్న మధ్యవర్తిత్వ పాత్రను కూడా ఐక్యరాజ్యసమితి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించింది.

# కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు

**మొదటిపేజీ తరువాయి..** , ముమ్మాటికీ పీసీసీ నివేదికేనని తాము మొదటి నుంచి చెబుతున్న మాట అక్షరాలా నిజమైందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్‌పై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న వారికి ఈ తీర్పుతో జ్ఞానోదయం కావాలని హితవు పలికారు. రాజ్యాంగానికి, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో స్పష్టమైందని కేటీఆర్ అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడంతో ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపులకు బ్రేక్ పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అహర్నిశలు శ్రమించిన ఇంజనీర్లకు, రాష్ట్ర రైతాంగానికి దక్కిన విజయమిదని కొనియాడారు. కేసీఆర్ కృషితోనే నేడు తెలంగాణలో ప్రతి నీటి బొట్టు పారుతోందని, గోదావరి నది ప్రవహించినంత కాలం ఆయన పేరును ఎవరూ చెరిపివేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఖర్చుపై కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని, కేవలం రూ. 3,800 కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే, లక్ష కోట్లు వృథా అయ్యాయని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతుల కోసం పని చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ పడావు పెట్టినందుకు సీఎం రైతులకు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. అలా కాకుండా రాజకీయ క్రీడ కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి, గోదావరి జలాలను పక్క రాష్ట్రాలకు తరలించే కుతంత్రాలు చేస్తే అన్నదాతల చేతిలో ప్రభుత్వానికి వాతలు తప్పవని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# హైకోర్టు తీర్పును అనుకూలంగా మార్చుకోవాలని చూడటం హాస్యాస్పదం

హైదరాబాద్
కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయి తదుపరి కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ నేతలు తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూడటం హాస్యాస్పదమని, కోర్టు ఎవరికీ 'క్లీన్ చిట్' ఇవ్వలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకం పూర్తిగా రాజ్యాంగబద్ధమని, ప్రభుత్వానికి అటువంటి కమిషన్లను వేసే పూర్తి అధికార పరిధి ఉందని న్యాయస్థానం సమర్థించిందని ఆయన గుర్తు చేశారు. కమిషన్ జారీ చేసిన జీవో నంబర్ 6 చట్టబద్ధమేనని కోర్టు పేర్కొనడం ప్రభుత్వ నైతిక విజయమని ఆయన అభివర్ణించారు.

జ్యుడిషియల్ కమిషన్ విచారణలో కేవలం నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక మరియు ప్రొసీజరల్ అంశాన్ని మాత్రమే హైకోర్టు ఎత్తిచూపిందని, దీనివల్ల విచారణ నివేదికలోని అంశాలు లేదా వాస్తవాలు మారిపోవని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ తీర్పు వల్ల ఇప్పటికే ప్రభుత్వం కోరిన సీబీఐ విచారణకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని ఆయన నొక్కి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడం అనేది ప్రజల కళ్లముందు ఉన్న పచ్చి నిజమని, మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యం మానవ తప్పిదమేనని ఇప్పటికే ఎన్డీఎస్ఏ (చీణూూ) మరియు విజిలెన్స్ నివేదికలు స్పష్టం చేశాయని తెలిపారు. లక్ష కోట్ల ప్రజాధనం వృథా కావడానికి కారణమైన డిజైన్ లోపాలు, నిర్మాణ వైఫల్యాలపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి తీరుతుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రాజెక్టు కుంగిపోయిందని, అప్పట్లో వారు చేసిన తప్పుల వల్ల నేడు ఏటా రూ. 15 వేల కోట్ల నుంచి రూ. 20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీల భారం రాష్ట్రంపై పడుతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రెండు పిల్లర్ల సమస్యే కాదని, మొత్తం మూడు బ్యారేజీల పునాదులే అనుమానాస్పదంగా ఉన్నాయని నిపుణులు తేల్చారని చెప్పారు. హైకోర్టు తీర్పు పూర్తి పాఠాన్ని అధ్యయనం చేసిన తర్వాత, సాంకేతిక లోపాలను సరిదిద్దుకుంటూ దోషులను చట్టం ముందు నిలబెట్టేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బాధ్యులెవరైనా సరే కఠిన శిక్ష తప్పదని, ప్రజాధనం లూటీని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు.

## డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

### ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు

### సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి

**హైదరాబాద్, ఏప్రిల్22 :** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉదృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో
సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

# ఇల్లందు గర్వించదగ్గ విద్యా యోధుడు శ్రీనివాస్ రావు!

- ముగిసిన 36 ఏళ్ల లెక్కల యుద్ధం..పుట్టిన గడ్డపైనే సగర్వంగా పదవీ విరమణ
- ప్రవాసం ఎక్కడైనా.. ప్రస్థానం ఇల్లందులోనే! గణిత సామ్రాజ్యానికి 'విజయ విరమణ' పలుకుతున్న పద్మశాలి ముద్దుబిడ్డ!

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

ఏ నేల మీదనైతే తొలి అడుగులు వేశారో.. ఏ గాలిని పీల్చి విద్యావంతుడయ్యారో.. సరిగ్గా అదే సొంత గడ్డపై తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానానికి ముగింపు పలకడం ఒక అరుదైన అదృష్టం. ముప్పై ఆరేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో అక్షర సేద్యం చేసి, వేలాది మంది విద్యార్థుల భవితను తీర్చిదిద్దిన బొద్దుల శ్రీనివాస్ రావు, నేడు తన పుట్టిన గడ్డ ఇల్లందులోనే సగర్వంగా పదవీ విరమణ చేస్తున్నారు.

**వ్యక్తిగత జీవితం: అనురాగాల లోగిలిలో పెరిగిన ఐదో ప్రాణం**

1965 డిసెంబర్ 13న ఇల్లందు గడ్డపై బొద్దుల గట్టయ్య, లక్ష్మి పుణ్య దంపతుల నోముపల గర్భాన శ్రీనివాస్ రావు జన్మించారు. ఆరుగురు సంతానంలో ఐదవ వాడిగా పుట్టిన ఆయన, ఇద్దరు అక్కలు, ఒక అన్న, తమ్ముడి మధ్య ఎంతో గారాబంగా, అనురాగాల మధ్య పెరిగారు. 1993 జూలై 17న తన మేనమామ బండారి మల్లయ్య కుమార్తె భాగ్యలక్ష్మిని వివాహమాడి, ఒక ఆదర్శవంతమైన కుటుంబాన్ని నిర్మించుకున్నారు. నేడు వారి కుమార్తె శ్రీ తేజ (టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్), కుమారుడు వెంకట సాయి సద్గుణ (మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా) ఉన్నత పదవుల్లో ఉండటం వెనుక శ్రీనివాస్ రావు తపస్సు దాగి ఉంది.


**విద్యాభ్యాసం: ఇల్లందు నుంచి నల్గొండ వరకు సాగిన అక్షర యాత్ర**

శ్రీనివాస్ రావు విద్యా ప్రయాణం అంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే సాగడం గమనార్హం. ఇల్లందులోని యూపీఎస్ స్టేషన్ బస్తీలో 1 నుండి 7 వరకు, మెయిన్ రోడ్డు హైస్కూల్లో 8 నుండి 10 వరకు చదువుకుని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఖమ్మంలోని ప్రతిష్టాత్మక ఎస్.ఆర్ అండ్ బి.జి.ఎన్.ఆర్ కళాశాలలో డిగ్రీ, అనంతరం టీటీసీ, నల్గొండలోని డి.వి.ఎం కాలేజీలో బి.ఇ.డి పూర్తి చేశారు. తాను చదువుకున్న విద్యా సంస్థల విలువను కాపాడటమే కాకుండా, తిరిగి అదే విద్యా వ్యవస్థకు ప్రాణం పోయాలనే దృఢ సంకల్పంతో ఆయన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు.

**ఉద్యోగ ప్రస్థానం: సింగరేణి విద్యార్థుల పాలిట 'రామానుజన్' వారసుడు**



1990 డిసెంబర్ 06న సింగరేణి విద్యా సంస్థల ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగిగా కెరీర్ ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగిన శ్రీనివాస్ రావు ఒక అరుదైన రికార్డును సృష్టించారు. శ్రీరాంపూర్, మణుగూరు, మందమరి, రామకృష్ణపూర్ పాఠశాలల్లో పనిచేస్తూ ఎంతోమంది కార్మిక బిడ్డలకు విజ్ఞానాన్ని పంచారు. 2011 ఏప్రిల్ 24న తాను చదువుకున్న ఇల్లందు హైస్కూల్‌కే ఉపాధ్యాయునిగా వచ్చి చివర్లో హెడ్ మాస్టర్‌గా పదోన్నతి పొందడం ఒక మధుర జ్ఞాపకం. గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ వారసుడిగా, అత్యంత క్లిష్టమైన లెక్కలను కూడా విద్యార్థులకు అరటిపండు వలిచినట్టు సులభంగా బోధించడంలో ఆయన దిట్ట. భద్రాద్రి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆయన నిబద్ధతకు నిలువుటద్దం.



**మిత్రుడి మనోగతం: భోళాశంకరుడి లాంటి స్నేహశీలి**

ఆయన చిన్ననాటి మిత్రుడు కొండి కుమార్ స్వామి శ్రీనివాస్ రావు వ్యక్తిత్వం గురించి చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "శ్రీనివాస్ వ్యక్తిత్వం భోళాశంకరుడిని తలపిస్తుంది. ఆయనలో కపటం లేని ప్రేమ, నిఖార్సైన దేశభక్తి ఉన్నాయి. స్నేహానికి ప్రాణమిచ్చే గుణం ఆయన సొంతం. ఉపాధ్యాయుడిగా ఎంత కఠినంగా ఉంటారో, స్నేహితుడిగా అంతటి మృదుస్వభావి. ఆయన పదవీ విరమణ చేసినా, ఆయన నేర్పిన విలువలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయి" అని పేర్కొన్నారు.

**కుమారుడి గర్వం: తండ్రి కాదు.. మా జీవితానికి పునాది!**

ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన కుమారుడు వెంకట సాయి సద్గుణ తన తండ్రి గురించి గర్వంగా చెబుతూ.. "మా నాన్న మాకు తండ్రి కంటే ముందే ఒక గొప్ప గురువు. తను పనిచేసే స్కూల్లోనే మమ్మల్ని చదివించి, విద్య విలువను ప్రాక్టికల్‌గా చూపించారు. నేడు నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం ఆయన నేర్పిన క్రమశిక్షణే. ఒక తండ్రిగా ఆయన మాకు అందించిన విద్యా బోధనలే మమ్మల్ని విజయపథంలో నడిపిస్తున్నాయి" అని తెలిపారు.

**పుట్టిన గడ్డపైనే 'విజయ విరమణ'.. ఒక అరుదైన గౌరవం!**

ఎక్కడో మొదలైన ఉద్యోగ ప్రయాణం, ఎన్నో మలుపులు తిరిగినా, చివరకు తాను పుట్టిన.. తాను చదువుకున్న ఇల్లందు మట్టిలోనే ముగియడం ఒక అద్భుతమైన ఘట్టం. అంకెలను అక్షరాలుగా మార్చి, లెక్కలను జీవిత పాఠాలుగా బోధించిన ఈ 'గణిత మాంత్రికుడి' సేవలు ఇల్లందు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. ఒక పద్మశాలి బిడ్డగా, ఒక గొప్ప ఉపాధ్యాయుడిగా ఆయన సాధించిన ఈ 'విజయ విరమణ' స్ఫూర్తిదాయకం. ఆయన విశ్రాంత జీవనం ఆయురారోగ్యాలతో సాగాలని కోరుకుంటూ, ఇల్లందు గడ్డ తన ముద్దుబిడ్డకు సగర్వంగా వీడ్కోలు పలుకుతోంది! ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ కృష్ణయ్య, జనరల్ మేనేజర్ ఆఫ్ సింగరేణి ఎడ్యుకేషనల్ కొత్తగూడెం వెంకట చారి ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్టాఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రెసిడెంట్ ఆఫ్ అకేషన్ అజ్మీరా తుకారం, సీనియర్ ఉపాధ్యాయులు రవీందర్, రాజ గౌడ్, అరుణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు, మిత్రులు కొండి కుమార్ స్వామి, ఆగరాజు, వెంకటేష్, పి .సురేష్ కుమార్, రాజ్ శేఖర్, దంతాల ఆనంద్, లింగయ్య, వెంకట్ నరసయ్య పాల్గొన్నారు.

# చిన్నారి చేతిలో 'పచ్చని' విప్లవం

- 1500 మొక్కలు నాటిన రికార్డుల బాలుడు విశ్వామిత్రకు కొత్తగూడెంలో ఘన సన్మానం

కొత్తగూడెం ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

గ్లోబల్ వార్మింగ్ ఉచ్చులో చిక్కుకుని విలవిలలాడుతున్న భూగోళానికి కావలసింది కేవలం ప్రభుత్వాల ప్రకటనలు కాదు, చేతల్లో చూపించే చిత్తశుద్ధి అని నిరూపించాడు కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రెండవ తరగతి చదువుతున్న చిట్టి విద్యార్థి విశ్వామిత్ర చౌహన్. ప్రపంచ దరిత్రి దినోత్సవం సందర్భంగా, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా అతను చేసిన కృషి అసాధారణం. ఈ చిన్నారి ఇప్పటివరకు తన ఊపిరి కంటే మిన్నగా భావిస్తూ 1500 మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం సామాన్యులకు సాధ్యంకాని విషయం. అతని ఈ అద్భుత సేవలను గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి సంస్థలు పురస్కారాలతో గౌరవించాయి. రికార్డుల కోసం కాకుండా, రేపటి తరం కోసం అతను పడుతున్న తపన, నేటి సమాజానికి ఒక గొప్ప సందేశం. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబుబాలుడు విశ్వామిత్ర చౌహన్‌ను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ.. "విశ్వామిత్ర కేవలం రికార్డుల బాలుడు కాదు, ఈ నేల తల్లికి ఒక నిజమైన వారసుడు. ఒక చిన్నారి ఇంతటి పెను బాధ్యతను భుజాన వేసుకుంటే, విజ్ఞులైన పెద్దలు ఇంకా నిర్లక్ష్యంగా ఉండటం భావ్యం కాదు" అని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి. మణి మృదుల, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని బాలుడిని అభినందించారు. విశ్వామిత్ర చేస్తున్న ఈ మొక్కల యజ్ఞం వెనుక ఉన్న మౌలిక సత్యాన్ని మనం గ్రహించాల్సిన అవసరం ఉంది. చెట్లు నాటడం అంటే కేవలం పచ్చదనం పెంచడం కాదు, జీవకోటి మనుగడకు ప్రాణవాయువును భద్రపరుచుకోవడం. ఒక చెట్టు వాతావరణంలోని హానికరమైన కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని,



మనకు ఊపిరినిచ్చే ఆక్సిజన్‌ను ధారబోస్తుంది. భూగర్భ జలమట్టాన్ని పెంచడంలో, భూసారాన్ని కాపాడడంలో, పక్షులు మరియు జంతువులకు ఆశ్రయం కల్పించడంలో చెట్ల పాత్ర అనన్యం. నేడు మనం అనుభవిస్తున్న అసాధారణ ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలకు కారణం మనం ప్రకృతిని పణంగా పెట్టి చేస్తున్న అభివృద్ధి కాదా? విశ్వామిత్ర వంటి చిన్నారులు రేపటి పచ్చని ప్రపంచం కోసం ఒక ఆశగా కనిపిస్తుంటే, మనం మన స్వార్థం కోసం చెట్లను నరికివేస్తూ వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నామా? అని ప్రతి ఒక్కరూ మేల్కోవాల్సిన సమయం ఇది. ఒక చిన్న మొక్కను నాటడం ద్వారానే ఆ పచ్చని పోరాటంలో మనం భాగస్వాములం కాగలమని ఈ సందర్భం గుర్తు చేస్తోంది.

# బీబీపేట్ విలేకరుల సమావేశం మాజీ ఎంపిటిసి



బీబీపేట్, ఏప్రిల్ 22 ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా : బీబీపేట్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన తాజా మాజీ ఎంపిటిసి కొరివి నీరజ నర్సింలు ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ ప్రజలు ఎంతో ఆదరించి నా భార్యను ఎంపీటీసీగా గెలిపించారు. అదేవిధంగా దానికి గ్రామానికి సేవ చేసుకునే అదృష్టం దక్కిందని ఎవరికి ఎటువంటి సమస్యలు ఉన్నారు వారి వెంటే ఉండి సమస్యను పరిష్కరించాము. కొన్ని వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాను, కుట్టు మిషన్లు, బోరు మోటర్లు లాంటివి కూడా ప్రజలకు పింఛన్లు ఉపాధి జాబ్ కార్డు కూడా దగ్గరుండి వారికి అందజేసిన అదేవిధంగా కొన్ని రోజుల క్రితం నేను రాజకీయ పార్టీలకు అతీతంగా ఉంటున్నానని మీడియా ముఖంగా తెలుపను దానికి బదులుగా ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేసి నన్ను ఎంతగానో ఆదరిస్తున్న ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ నాకు ఎటువంటి పార్టీ నుంచి బీఫామ్ లేకున్నా ప్రజల నుండి బీఫామ్ వస్తే కచ్చితంగా మళ్ళీ పోటీ చేసి ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కలిగిస్తారని వారి సమస్యలను నేను గెలిచిన ఓడిన ఎప్పటికప్పుడు ముందుండి వారికి వారి సమస్యల పట్ల పరిష్కారాలు చూపుతానని ఈ సందర్భంగా తెలిపారు.

# భద్రాద్రిలో 26న దర్శన విరామం

- ఆలయ పునర్నిర్మాణ సంకల్పంలో భక్తుల సహకారం అనివార్యం




భద్రాచలం ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

శతాబ్దాల చరిత్రకు నిలువుటద్దం, భక్తుల కొంగుబంగారం భద్రాద్రి రామాలయం ప్రస్తుతం అభివృద్ధి పథంలో సరికొత్త రూపును సంతరించుకుంటోంది. ఈ మహత్కార్యంలో భాగంగా, ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీన స్వామివారి దర్శన వేళల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ రోజు నిర్వహించ తలపెట్టిన అత్యంత పవిత్రమైన 'కళావాహన' కార్యక్రమం దృష్ట్యా, ఉదయం నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు అన్ని రకాల ఆర్జిత సేవలు, సాధారణ దర్శనాలను ఆలయ అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు. దేవాలయ ప్రాశస్త్యాన్ని కాపాడుకుంటూనే, భవిష్యత్ తరాలకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించేందుకు చేపట్టిన ఈ పనుల వల్ల భక్తులకు స్వల్ప అసౌకర్యం కలిగినా, అది ఆలయ అభ్యున్నతికేనని గుర్తించాలి. తిరిగి మధ్యాహ్నం 3:00 గంటల నుండి యధావిధిగా భక్తులకు దర్శన భాగ్యం కలుగుతుందని ఈవో స్పష్టం చేశారు. భక్తి అంటే కేవలం దర్శనం మాత్రమే కాదు, క్షేత్ర క్షేమం కోసం తీసుకునే నిర్ణయాలను గౌరవించడం కూడా అని గ్రహించి, భక్తులు ఈ మార్పును సానుకూల దృక్పథంతో గమనించి ఆలయ యంత్రాంగానికి సహకరించాలని కోరుతున్నాము.

# కాలుష్య కాటుకు చిగురుటాకు బలి

- బూర్గంపాడులో తీరని విషాదం.. అభివృద్ధి ముసుగులో ఇంకెన్ని ప్రాణాలు?



భద్రాచలం ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

పారిశ్రామిక ప్రగతి పరవళ్లు తొక్కుతున్న చోట, సామాన్యుడి ప్రాణం మాత్రం కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం గాంధీనగర్‌కు చెందిన సోమోరు మనీషా (17) అనే యువతి బుధవారం క్యాన్సర్‌తో పోరాడుతూ ప్రాణాలు వదలడం స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ పేద కుటుంబం, తమ బిడ్డను కాపాడుకునేందుకు అప్పుసప్పు చేసి ఏకంగా 10 లక్షల రూపాయలు ఖర్చు చేసినా, కాలుష్య భూతం ముందు ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అయితే, ఇది కేవలం ఒక మరణం మాత్రమే కాదు, స్థానిక కర్మాగారాల నుండి వెలువడుతున్న విషతుల్యమైన వాయువులు, వ్యర్థాల వల్ల ఈ ప్రాంతం 'క్యాన్సర్ నిలయం'గా మారుతోందనడానికి ఒక సజీవ సాక్ష్యం. అభివృద్ధి అంటే కేవలం యంత్రాల చప్పుడు మాత్రమేనా? మనుషుల ప్రాణాలకు విలువే లేదా? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నా, పాలకుల నిర్లక్ష్యం, అధికారుల మౌనం ప్రాణాంతకంగా మారుతోంది. ఇప్పటికైనా యంత్రాంగం నిద్రమత్తు వదిలి, కాలుష్య నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ పారిశ్రామిక క్షేత్రాలు పేదవాడి వల్లకాడులుగా మారే ప్రమాదం ఉందని సీనియర్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మనీషా మృతికి బాధ్యులెవరు? ఆ పేద తల్లిదండ్రుల కడుపుకోతకు సమాధానం చెప్పే వారెవరు? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తున్నాయి.

# అన్నదాతకు అండగా.. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరగాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టమైన ఆదేశం



కొత్తగూడెం ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

ఎండనక, వాననక రేయింబవళ్లు శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతు కళ్ళాల్లో ఎదురుచూడకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను కఠినంగా ఆదేశించారు. మంగళవారం జిల్లా యంత్రాంగంతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించుకున్న 83,635 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. కేవలం గణాంకాలు చూపించడం ముఖ్యం కాదని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతుకు కనీస సౌకర్యాలు కల్పిస్తూ, రవాణాలో అడ్డంకులు తొలగించి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడటమే అసలైన యంత్రాంగ పనితీరుకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. లక్షలాది క్వింటాళ్ల ధాన్యం ఆకాశం వైపు చూస్తుంటే అధికారుల మౌనం తగదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి ప్రతి గింజను ప్రభుత్వం సేకరించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. పాలకుల ఆదేశాలు ఫైళ్లకే పరిమితం కాకుండా, రైతు ముంగిట సంతోషాన్ని నింపేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సమీక్షా సమావేశం తేటతెల్లం చేస్తోంది.

# ఇల్లందులో నిలిచిన 'చక్రం'.. రోడెక్కిన కార్మికుడు, రోడ్డున పడ్డ ప్రయాణికుడు!




ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

ప్రజా రవాణా వ్యవస్థకు గుండెకాయ వంటి ఆర్టీసీ నేడు స్తంభించిపోయింది. జేఏసీ పిలుపుతో ఇల్లందు డిపో కార్మికులు సమ్మె బాట పట్టడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే బస్టాండ్ నిర్మానుష్యంగా మారి వెలవెలబోతోంది. తమ ఉనికి కోసం, హక్కుల కోసం కార్మికులు చేస్తున్న ఈ పోరాటంలో భాగంగా బస్సులు డిపోలకే పరిమితం కాగా, సామాన్య ప్రయాణికుడు గమ్యం చేరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. "మేము అడుగుతున్నది గొంతెమ్మ కోర్కెలు కాదు.. 32 డిమాండ్లలో ఒక్కటైనా పరిష్కారమైందా?" అంటూ కార్మికులు సంధిస్తున్న ప్రశ్నలు నేడు ప్రభుత్వానికి సవాలుగా మారాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పీఆర్సీ అమలు చేయాలన్న న్యాయమైన డిమాండ్ల విషయంలో 'వెనక్కి తగ్గేదే లేదని' వారు భీష్మించుకోవడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయితే, ఒకవైపు కార్మికుల ఆవేదన, మరోవైపు ప్రయాణికుల రోదన మధ్య సంక్షేమ రాజ్యంగా చెప్పుకునే వ్యవస్థ ఎటువైపు సాగుతోందన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. చక్రం తిరిగితేనే రాష్ట్రం నడుస్తుంది, కానీ ఆ చక్రం తిప్పే చేతులకు భరోసా కరువైనప్పుడు ప్రజాస్వామ్యంలో ప్రగతి ఎలా సాధ్యం? ఇప్పటికైనా పాలకులు మొండివైఖరి వీడి, చర్చల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనకపోతే సామాన్యుడి ప్రయాణం మరింత భారంగా మారే ప్రమాదం ఉంది.

జన సంఘర్షణ
గురువారం
23 ఏప్రిల్ 2026

# జాతీయ స్థాయిలో మెరిసిన ఆదివాసీ ఆణిముత్యం

- జేఈఈ మెయిన్స్‌లో శరత్ చంద్ర ప్రభంజనం
- 99.976 పర్సెంటైల్‌తో దేశంలో 452వ ర్యాంక్... ఎస్టీ కేటగిరీలో 4వ స్థానం సాధించిన ఇల్లందు యువ ప్రతిభ

ఇల్లందు ప్రతినిధి (జన సంఘర్షణ )

ఇల్లందు మండలం, సుభాష్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొమురభీమ్ కాలనీకి చెందిన ఆదివాసీ విద్యార్థి మోకాళ్ళ శరత్ చంద్ర జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. జేఈఈ మెయిన్స్‌లో 99.976 పర్సెంటైల్ సాధించి దేశవ్యాప్తంగా 452వ ర్యాంక్, ఎస్టీ కేటగిరీలో 4వ ర్యాంక్ సాధించడం విశేషం. లక్ష్యం స్పష్టంగా ఉంటే ఆకాశమే హద్దు కాదని నిరూపించిన శరత్ చంద్ర, పట్టుదలతో పాటు క్రమశిక్షణను ఆయుధాలుగా మార్చుకొని దేశంలోని ప్రతిభావంతుల సరసన నిలిచాడు. చిన్ననాటి నుంచే గణితంపై ఆసక్తి పెంచుకున్న అతనికి తల్లిదండ్రులు సరైన మార్గనిర్దేశం చేయడంతో ఈ విజయాన్ని అందుకున్నాడు. శరత్ చంద్ర తల్లిదండ్రులు మోకాళ్ళ మోహన్ రావు, పాయం స్వరూప ఉపాధ్యాయ దంపతులు. వారు తమ వృత్తితో పాటు సమాజ సేవలోనూ ముందుండి నిరుపేద విద్యార్థులకు సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. “ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ విద్యార్థి చదువు ఆగకూడదు” అనే సంకల్పంతో అనేక మంది పిల్లలకు అండగా నిలుస్తున్నారు. వారి సేవా దృక్పథం, విలువలతో కూడిన పెంపకం శరత్ చంద్ర విజయానికి బలమైన పునాదిగా నిలిచింది. ప్రస్తుతం వచ్చిన ర్యాంక్‌తో ప్రతిష్టాత్మక జాతీయ సాంకేతిక సంస్థలో సీటు సాధించే అవకాశం ఉన్నప్పటికీ, శరత్ చంద్ర లక్ష్యం ఇంకా ఎత్తులోనే ఉంది. జేఈఈ అడ్వాన్స్‌లో విజయాన్ని





సాధించి అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలో ప్రవేశం పొందాలని సంకల్పంతో మరింత శ్రమిస్తున్నాడు. ఆదివాసీ విద్యార్థుల ప్రతిభకు ఇది నిలువెత్తు నిదర్శనమని, సరైన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు సృష్టించగలరని శరత్ చంద్ర నిరూపించాడు. అతని విజయంపై ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల ప్రతినిధులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. శరత్ చంద్ర భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ అధ్యాపక కార్యవర్గం ఏర్పాటు: టిజిఆప్ట

- యూనివర్సిటీ అధ్యక్షులుగా డా. సి హెచ్ చంద్రయ్య.

హైదరాబాద్, కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 22, (జన సంఘర్షణ):

తెలంగాణ అల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం అధ్యాపకుల సంఘము (టిజిఆప్ట) అధ్వర్యంలో మంగళవారం రోజు బాచుపల్లి లోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కమిటీ నియమించడం జరిగింది. వివిధ రకాలుగా పనిచేస్తున్న అధ్యాపకులు పార్ట్ టైం( అవర్ బేసిస్), గెస్ట్ పాకల్టీ, ఏక మొత్తం పాకల్టీ లుగా పనిచేస్తున్నారు. అందరికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం ప్రతి అధ్యాపకునికి నెలకు 50,000/- జీతం కన్సాలిడేటెడ్ పేమెంట్ ఇవ్వాలని, ఇంత వరకు టీజీఆప్ట చేసిన, చేస్తున్న ప్రయత్నాలు ప్రభుత్వ స్పందన వివరించి అధ్యాపకుల సమిష్టికృషి వల్లనే లక్ష్యం చేరుకొంటామని దిశానిర్దేశం చేయడం జరిగింది. అనంతరం యూనివర్సిటీ కమిటీ నియమించడం జరిగింది. అందరి ఆమోదంతో


TELANGANA STATE ALL UNIVERSITIES
PART-TIME TEACHER'S ASSOCIATION
(TG-AUPTA)
TELANGANA STATE, HYDERABAD

PRESIDENT Dr. Erram Nagendram | VICE PRESIDENT Dr. M. LINGASWAMY | WORKING PRESIDENT Dr. P. SRILAKSHMI REDDY | WORKING PRESIDENT Dr. K. YOUGENDER

Date: 21-04-2026

సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ (టీజిఆప్ట -ఎస్ పిఆర్ టియూ) అధ్యక్షులుగా డా.సి హెచ్ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా డా. ఎం. రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా డా. ఎన్ శ్రీనివాసన్, డా. షేక్ హసీన, డా. రవీందర్ నాయక్, డా. రాయల హరిచంద్ర, డా మంచాల మహేశ్వర్ లను అందరి అధ్యాపకుల ఆమోదంతో నియమించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా టి జి ఆప్ట రాష్ట్ర కార్యవర్గం నూతనంగా ఎంపికైన యూనివర్శిటీ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతూ అధ్యాపకుల సంక్షేమం కోసం పనిచేయాలని మీకు రాష్ట్ర నాయకత్వం ఎల్లవేళలా తోడుగా ఉంటుందని, ప్రజాప్రభుత్వంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారులతో ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకునేలా పనిచేయాలని టీజీఆప్ట రాష్ట్ర కార్యవర్గం సూచించింది.

# ఇల్లందు ప్రగతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముద్ర..

- వార్డు ప్రగతిలో కౌన్సిలర్ శివ కిరణ్ చొరవ

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

రాజకీయ అధికారం అంటే కేవలం హోదా మాత్రమే కాదు, అది ప్రజలకు సేవ చేసేందుకు దక్కిన ఒక బాధ్యతని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి స్పష్టం చేశారు. బుధవారం ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో ఆయన నిర్వహించిన విస్తృత పర్యటన కేవలం హామీలకే పరిమితం కాకుండా, నిరుపేదల సొంతింటి కలలను సాకారం చేసే దిశగా సాగింది. పదో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని, వారితో కలిసి గృహాలను ప్రారంభించిన మంత్రి, ఆ కుటుంబాల్లో నెలకొన్న సంతోషాన్ని చూసి మురిసిపోయారు. ఇది కేవలం ఒక ఇంటి ప్రారంభోత్సవం కాదు, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాకు నిదర్శనం. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇల్లందు పట్టణ అభివృద్ధికి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.50 కోట్ల నిధులను రెండు విడతల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించి పట్టణ వాసుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ తన వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్రజల తక్షణ అవసరాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. యువ




నాయకత్వం క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయడాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కౌన్సిలర్ శివ కిరణ్ వంటి వారు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితేనే సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరుతాయని మంత్రి



పేర్కొన్నారు. మండుతున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చైర్‌పర్సన్, కౌన్సిలర్లు నిత్యం వార్డుల్లో పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. సమస్యలను వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ వంటి అధికారుల పనితీరును ప్రస్తావిస్తూ, ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏది ఏమైనా, మంత్రి పొంగులేటి పర్యటన ఇల్లందు నియోజకవర్గంలో కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికింది.

# ఆర్టీసీ సమ్మె విరమించి చర్చలకు రండి: మంత్రి పొన్నం

తెలంగాణ హైదరాబాద్ /ఏప్రిల్22 /(జన సంఘర్షణ)



ఆర్టీసీ జేఏసీతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని, సమ్మె విరమించి చర్చలకు రావాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. 32 సమస్యల్లో 29 అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆర్టీసీని నిర్వీర్యం చేసుకోవద్దని ఆయన సూచించారు. కమిటీ వేసి, 4 వారాల సమయం అడిగామని, గత ప్రభుత్వం చేపట్టిన చర్యలను గుర్తుంచుకోవాలని మంత్రి పొన్నం అన్నారు. ఆర్టీసీని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# బీబీపేట్‌లో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవం

బీబీపేట్, ఏప్రిల్ 22 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా, బీబీపేట్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం బుధ వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎదుల సాత్విక సాయినాథ్, ఉప సర్పంచ్ చందుపట్ల ప్రశాంత్, పి ఏ సి ఎస్ సీఈఓ నర్సా గౌడ్ ,వ్యవసాయ అధికారులు, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులను పరిశీలించిన గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 22( జనసంఘర్షణ )



చిక్కడపల్లి, వివేక్ నగర్ సమీపంలోని పెండగంటి లా కాలేజీ, ఆంధ్ర విద్యాలయ పాఠశాల వద్ద జిఎచ్ఎంసి కార్పొరేటర్ ఫండ్స్ రూ. 1కోటీలో భాగంగా 12 లక్షల నిధులతో గతంలో ప్రారంభించిన నూతన సిసి రోడ్డు నిర్మాణం పనులను బుధవారం గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ స్థానికులతో కలిసి పరిశీలించారు. స్థానికంగా దుకాణందారులకు, పాదచారులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా వెంటనే రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ రోజు రాత్రి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి మరో 15 రోజుల్లో నూతన సిసి రోడ్డు ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మాజీ కార్పొరేటర్ స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు శ్రీకాంత్, పీ.నర్సింగ్ రావు, ఆనంద్ రావు, సాయి కుమార్, సత్యేంధర్, ప్రశాంత్, స్థానికులు శాలిని, తులసి, రాజు, కె.శ్రీకాంత్, మల్లేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

బీబీపేట్, ఏప్రిల్ 22 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం యాడారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం గ్రామ సర్పంచ్ గొబ్బూరి సుధారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఉప సర్పంచ్ సుధాల రాజు పిఏసిఎస్ సీఈఓ నర్సా గౌడ్ పిఏసిఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇల్లందు ప్రగతి పథంలో ‘ఇందిరమ్మ’ భరోసా

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)



నిరుపేద సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుధవారం ఇల్లందులో పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 10వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఆయన, మున్సిపల్ కార్యాలయంలో నూతన ఛాంబర్‌ను ప్రారంభించి కౌన్సిలర్లతో కలిసి పట్టణ పురోగతిపై సమీక్షించారు. కేవలం భవనాల ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపారు. ప్రత్యేకంగా, సమాజ హితం కోరే పాత్రికేయుల కష్టాన్ని గుర్తించి, వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించడం గమనార్హం. అధికారం అంటే కేవలం పాలన మాత్రమే కాదు, అట్టడుగు వర్గాల అవసరాలను గుర్తించి ఆదుకోవడమేనని ఈ పర్యటన మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరినప్పుడే ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం లభిస్తుంది.

# రవాణా కష్టాల సుడిగుండంలో మామిడిగుండాల

- రోడ్డు పనులు పూర్తి చేయాలని మంత్రి పొంగులేటికి వినతి

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)




మారుమూల గ్రామాల అభివృద్ధికి రహదారులే వారధులని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ఏళ్ల తరబడి నిలిచిపోయిన మామిడిగుండాల బీటీ రోడ్డు పనులే ఇందుకు సజీవ సాక్ష్యం. కోటిలింగాల నుండి మామిడిగుండాల వరకు ఉన్న మార్గం ప్రస్తుతం రహదారిలా కాకుండా మృత్యుకుహరంలా దర్శనమిస్తోంది. గుంతలమయమైన ఈ బాటలో ప్రయాణించడం అంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవడమేనని, ముఖ్యంగా గర్భిణులు, అత్యవసర వైద్యం అవసరమైన రోగుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉందని సర్పంచ్ ఎట్టి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తూ, పనులు వెంటనే పునఃప్రారంభించాలని వినతిపత్రం అందజేశారు. ఒకవైపు డిజిటల్ యుగం వైపు దూసుకుపోతున్నామంటున్న తరుణంలో, కనీస రవాణా సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఈ అగచాట్లు పాలకుల ప్రాధాన్యతలను ప్రశ్నిస్తున్నాయి. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినప్పటికీ, ఆ హామీ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు మొదలై తమ ప్రయాణ కష్టాలు తీరాలని గ్రామస్తులు గట్టిగా కోరుకుంటున్నారు.

# బాధితుల పక్షాన సుదర్శన్ కోరి గళం

- తీరని గూడు కల.. సామాన్యుడిపై బ్యాంకుల 'నోటీసు'ల విసురు!
- గృహకల్ప లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)



గూడు లేని నిరుపేదకు నీడనందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన పథకాలు, క్షేత్రస్థాయిలో పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత వల్ల పేదల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లబ్ధిదారుల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. దాదాపు 19 మంది లబ్ధిదారులు తమ వంతు వాటాగా నగదు చెల్లించినప్పటికీ, ఏళ్లు గడుస్తున్నా గృహాల నిర్మాణం పూర్తికాకపోవడం గమనార్హం. ఒకవైపు గూడు దక్కక, మరోవైపు తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక వారు సతమతమవుతుంటే, బ్యాంకులు మాత్రం కనికరం లేకుండా ఒక్కొక్కరిపై రూ.300000 అప్పు ఉందంటూ నోటీసులు జారీ చేయడం పౌర సమాజం సిగ్గుపడాల్సిన విషయం. కేవలం గృహాలే కాకుండా, గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న '76 జీవో' పట్టాల వ్యవహారం కూడా ఇక్కడి ప్రజలను వేధిస్తోంది. ఎన్నికల సమయంలో హామీలు కురిపించిన నాయకులు, ఇప్పుడు పట్టాల ఊసే ఎత్తకపోవడం గమనార్హం. డబ్బులు కట్టి, ఆశగా ఎదురుచూస్తున్న సామాన్యుడికి న్యాయం ఎప్పుడు జరుగుతుంది? ప్రజాప్రతినిధులు కేవలం వినతులు స్వీకరించడానికే పరిమితమవుతారా లేక క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపుతారా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి.. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేసి, బాధితులకు బ్యాంక్ నోటీసుల నుండి విముక్తి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గోశాలకు వరిగడ్డి గోవుల కోసం మేత

పొతంగల్ హెగ్డోలి/ఏప్రిల్22/(జన సంరక్షణ)



హెగ్డోలి గ్రామము పోతంగల్ మండలం కు చెందిన రైతుకవి నాగం సాయిలు ప్రతి సంవత్సరం గోశాలకు వరిగడ్డి గోవుల కోసం అందచేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం కూడా అందచేయడం జరిగింది. బోధన్ లోని ఆర్య సమాజ్ గోశాలకు పశు గ్రాసం వితరణ చేశారు. హెగ్డోలి గ్రామ రైతులు ఆంజనేయులు, భీమ్ పటేల్, శంకర్, నానీ, రాజు, రాహుల్ తదితరులు. పాల్గొన్నారు.

# ఆటో బోల్తా ప్రయాణికులకు తీవ్ర గాయాలు

- తృటిలో తప్పిన ఘోర ప్రమాదం.

వర్నిరుద్రూర్/ఏప్రిల్22/(జన సంఘర్షణ)



వర్ని నుండి రుద్రూర్ వస్తున్న టీఎస్ 16 యూబీ 2724 ఆటో బోల్తాపడడంతో ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం 5:30 ప్రాంతంలో వర్ని నుండి మార్కెట్ చేసుకొని కొన్ని సరుకులను తీసుకొని ప్రయాణికులు వర్నిలో ఆటో కి రుద్రూర్ బయలుదేరారు. అక్బర్ నగర్ ఫుడ్ సైన్స్ కాలేజీ దాటగానే ఉన్న మలుపు వద్ద ముందుగా వస్తున్న ట్రాక్టర్ ను తప్పించడానికి బ్రేక్ వేయడంతో ప్రయాణికుడు కొన్న రోలు( కలబంద) ఆటో బ్రేక్ పైడిల్ కిందికి వచ్చి బ్రేక్ పడకపోవడంతో డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించి ఆటోను సైడ్ కు తీయడం వల్ల ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఆటోలో సుమారు 6 నుంచి 8 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. గాయపడిన క్షతగాత్రులను 108 ద్వారా చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి పంపించడం జరిగింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇల్లందు స్టేషన్ బస్తీలో ఘనంగా సిపిఐ(ఎం-ఎల్) జన్మదినోత్సవం

- జెండా ఆవిష్కరణతో ప్రారంభమైన కార్యక్రమం... ప్రజా సమస్యలపై పోరాటాలకు పిలుపు

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)




22-04-2026న ఇల్లందు పట్టణంలోని స్టేషన్ బస్తీలో సిపిఐ (ఎం-ఎల్) జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ బస్తి కార్యదర్శి పులిమామిడి శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కూరపాటి పద్మ జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో నాయకులు మాట్లాడుతూ.. పార్టీ స్థాపన లక్ష్యాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేదలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కుసారంగపాణి, పార్టీ పట్టణ కార్యదర్శి ఎండి రాసుద్దీన్ పాల్గొని మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, రైతు సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, బస్తి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- కోటి 20 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే
- గొల్లమాడలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్, ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)



నియోజకవర్గంలోని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. ఈ రోజు సర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, గొల్లమాడ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తిమ్మాపూర్ గ్రామంలో 90 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల ప్రహరీ గోడ , మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా గొల్లమాడ గ్రామంలో 24 లక్షల రూపాయల నిధులతో చెరువు మరమత్తు పనులు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యా వైద్యం సాగునీరు అందించడమే లక్ష్యంగా తాను ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నానని, 28 ప్యాకేజీ పై పలుమార్లు అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ ప్యాకేజీ పూర్తయితే కుంటాల నర్సాపూర్ మండలాలకు 13 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తాను శాసన సభ్యునిగా ఎన్నికైనప్పటి నుంచి శాసనసభలో సమస్యలపై పలుమార్లు మాట్లాడడం జరిగిందని, అధికార పార్టీలో లేకున్నా అందరి సహకారంతో ప్రతి ఏట నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. గత పది సంవత్సరాల కాలంలో లేని విధంగా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి 25 కోట్ల నిధులు, ముధోల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 220 కోట్ల రూపాయల నిధులు ఒకేసారి మంజూరు కావడం సంతోషకరమన్నారు. గతంలో లేని విధంగా తన హాయంలో అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం జరగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. గొల్లమడ చెరువు ప్రధాన కాలువ సిసి లైనింగ్ కు నిధులు మంజూరు చేయిస్తానని, అదేవిధంగా తిమ్మాపూర్ గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు ఇస్తానని చెప్పారు. వ్యాపారుల దోపిడీని అరికట్టేందుకు రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకు గతంలో లేని విధంగా మొత్తం ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దశల వారిగా సబ్ సెంటర్లను పెంచనున్నట్లు చెప్పారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఆయా గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

తెలంగాణ మహారాష్ట్ర నాందేడ్/ ఏప్రిల్22/ (జన సంఘర్షణ)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు (90) వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన 1984లో కేవలం నెల రోజుల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఆయన నిలిచిపోయారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు పని చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా విధులు నిర్వహించారు. ఎన్టీఆర్ నెల అమెరికాకు వెళ్లడంతో అప్పటి రాష్ట్ర గవర్నర్ రామ్లాల్ సహకారంతో ఎమ్మెల్యేలను తన వైపు మళ్ళించుకుని నాదెండ్ల భాస్కరరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పని చేశారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చెడరేగడంతో తిరిగి నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు.

# నిరుపేద అనాధ వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందజేసిన ఎంఏ హకీండాక్టర్

పోతంగల్/ ఏప్రిల్ 22 /(జన సంఘర్షణ)



నిజాంబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం గ్రామంలో బుధవారం రోజున నిరుపేద వృద్ధురాలు బస్టాండ్ నందు నివసిస్తుండగా ఆ మార్గం గుండా వెళ్తున్న సామాజిక సేవకర్త ఎంఏ హకీం గమనించి ఆమెకు సందర్శించి మాట్లాడి ఆయన వంతు సహకారంగా రెండు బెడ్ షీట్లు బట్టలు రాత్రిపూట దోమలు కుట్టకుండా ఫ్యాన్ ఏర్పాటు చేశారు. అన్ని సేవలో మానవ సేవ గొప్పదని ఆయన చెప్పారు. తదుపరి కార్యక్రమం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. బుద్ధ మందిరంలో బుద్ధ విగ్రహానికి పువ్వులు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఏ హకీమ్, మాజీ సర్పంచ్ షేరు, ఖాన్, మాజీ సర్పంచ్ ఏజజ్ ఖాన్, నిస్సార్, సజ్జత్, సూరా రెడ్డి గ్రామస్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల కడలిని దాటి.. విజయ తీరానికి చేరి

- యువతకు రోల్ మోడల్ 'కామ ప్రణయ్'
- 'ఆడంబరాలు లేవు.. అన్నీ ఆదర్శాలే! పేద విద్యార్థులకు అన్నదానంతో కామ ప్రణయ్ జన్మదిన వేడుకలు.'
- దాసరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)



సాధారణంగా మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టిన యువతకు బాధ్యతలు అనేవి పుట్టుకతోనే వెన్నంటి వస్తాయి. ఆ బాధ్యతల భారానికి కుంగిపోకుండా, తన స్వశక్తిని ఆయుధంగా మార్చుకుని, అతిచిన్న వయసులోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు కామ ప్రణయ్. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆయన జీవన ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

**కుటుంబ నేపథ్యం - క్రమశిక్షణతో కూడిన బాల్యం**

ఇల్లందు ప్రాంతానికి చెందిన కామ కోటేశ్వరరావు, పద్మ దంపతుల ద్వితీయ కుమారుడు ప్రణయ్. మధ్యతరగతి కుటుంబంలో పెరిగినప్పటికీ, తల్లిదండ్రులు అందించిన విలువలు, క్రమశిక్షణ ఆయనను ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా తీర్చిదిద్దాయి. సమాజం పట్ల గౌరవం, చదువు పట్ల అంకితభావం ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించగలమని ఆయన చిన్నతనం నుండే నమ్మారు.

**సామాజిక పోరాటాల నుండి సింగరేణి కొలువు దాకా..**

ప్రణయ్ ప్రయాణం కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. విద్యార్థి దశ నుండే తోటి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తెలుగు నాడు విద్యార్థి సమైక్యలో క్రియాశీలక నాయకుడిగా ఎదిగారు.



ఒకవైపు పేద విద్యార్థుల చదువు కోసం, ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం నిరంతరం పోరాటాలు చేస్తూనే, మరోవైపు తన కుటుంబ స్థితిగతులను మార్చాలనే పట్టుదలతో కష్టపడి చదివారు. ఆ కృషితోనే నేడు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెంలో 'ఫిట్టర్'గా ఉద్యోగం సాధించి, తన కాళ్ళ మీద తాను నిలబడటమే కాకుండా కుటుంబానికి అండగా నిలిచారు.

**నేటి యువతకు ఒక సందేశం**

నేటి కాలంలో కొందరు యువకులు చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు బానిసలై, విలువైన సమయాన్ని వృధా చేస్తూ తల్లిదండ్రులకు భారం అవుతున్నారు. అటువంటి వారికి ప్రణయ్ ఒక నిలువెత్తు సాక్ష్యం. లక్ష్యం పట్ల స్పష్టత ఉంటే పరిస్థితులు ఏదైనా విజయం తథ్యం అని ఆయన నిరూపించారు.

**సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు**

ప్రణయ్ జన్మదిన వేడుకను ఫీడింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ద్వారా ఘనంగా నిర్వహించారు . టీఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు దాసరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పాలు, పండ్లు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ.. "ప్రణయ్ సాధించిన విజయం ఈ తరం యువతకు స్ఫూర్తిదాయకం. విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలతో పాటు చదువులోనూ రాణించి ఉద్యోగం సాధించడం గొప్ప విషయం. ప్రతి యువకుడు ఇలాంటి పట్టుదలను అలవర్చుకోవాలి" అని ఆకాంక్షించారు.

# సోంపూర్ గ్రామంలో చలివేంద్రం

పోతంగల్ సోంపూర్/ఏప్రిల్22/(జన సంఘర్షణ)



పోతంగుల మండల కేంద్రంలో సోంపూర్ గ్రామం జీపీ ఆధ్వర్యంలో సర్పంచ్ కోమల్ సంజు పటేల్ బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసేది కాలంలో తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రైతుల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పడు చేసినట్టు ఆయన పేర్కొన్నాడు. చలివేంద్రాన్ని రైతులు అవగాహనదారులు నిర్వహించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సహాయకార్యదర్శి పోచీరం. కార్యదర్శి మోయును దిన్వార్డ్ మెంబర్ సాయి, కిరణ్, అంకుష్ ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

# తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుంది




- ప్రయాణికులారా సహకరించండి
- ఆర్టీసీ జేఏసీ పిలుపు

తెలంగాణ కరీంనగర్/ఏప్రిల్ 22/(జన సంఘర్షణ)

తెలంగాణ ఆర్టీసీ జేఏసీ చేపట్టిన సమ్మెను విఫలం చేయడానికి ప్రైవేట్ డ్రైవర్లతో బస్సులను నడపడానికి ప్రయత్నిస్తుంది. దీంట్లో భాగంగా అనుభవం లేని డ్రైవర్ కు కరీంనగర్ టు డిపో బస్సు వరంగల్ పంపడంతో. కరీంనగర్ క్లాక్ టవర్ వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయి లారీకి ఢీకొనడంతో 30 మంది ప్రయాణికులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. అయినప్పటికీ ప్రభుత్వం సీరియస్ గ తీసుకొని డ్రైవర్లు, కండక్టర్లు కావాలంటూ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల ఆర్టీసీ జేఏసీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన తమ డిమాండ్లను నెరవేర్చ వరకు తమ సమ్మె కొనసాగుతుందంటూ జేఏసీ నాయకులు ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదంటూ ఆర్టిసి జేఏసీ నాయకులు ప్రభుత్వ పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరిట కాలయాపన చేస్తున్నారే తప్ప తమకు న్యాయం చేయడం లేదంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క డ్రైవర్ 16 గంటలు విధులు నిర్వహించాల్సిన అవసరం నెలకొందని వారు వెల్లడించారు. మహిళా కండక్టర్లు మహిళా సిబ్బంది పై విధుల భారం పడుతుందంటూ జేఏసీ వెల్లడించింది. నెల రోజుల క్రితమే సమ్మె చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోవడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలలో బస్సులు డిపోకు పరిమితమయ్యాయి. ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హుజురాబాద్ ఆర్టీసీ డిపోవద్ద ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో డిపో నుంచి బస్సులను బయటకు పంపేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.సమ్మె కారణంగా హుజురాబాద్ డిపోకు చెందిన సుమారు 80 బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. అయితే, ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాగైనా బస్సులను బయటకు పంపాలని పోలీసులు ప్రయత్నించారు. కార్మికుల నిరసనల మధ్యే ఒక బస్సును పోలీసులు బలవంతంగా బయటకు పంపడంతో వాతావరణం వేడెక్కింది. దీనిని నిరసిస్తూ కార్మికులు డిపో గేటు ముందు బైఠాయించి భారీ ధర్నాకు దిగారు.హోరెత్తిన నినాదాలు...ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "నై చలేగా.. నై చలేగా.. బసకపయ్య నై చలేగా" అంటూ నినదించారు. తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఈ ధర్నాకు స్థానిక జేఏసీ నాయకులు హాజరై కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను మోసం చేసింది, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ కార్మికులను వంచిస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల తలరాతలు మారడం లేదు." అని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లపై 'అక్రమ' నీడ..



- మంత్రి పొంగులేటికి 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య వినతి
- ఇందిరమ్మ ఇళ్లపై 'అక్రమ' రాబందుల వేట.. పేదల సొంతింటి కలపై నీలినీడలు!

ఇల్లందు ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

పేదవాడి గూడు పదిలంగా ఉండాలని, ఆత్మగౌరవంతో తలదాచుకోవాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం, కొందరు అక్రమార్కుల పుణ్యమా అని అవినీతి కూపంగా మారుతోంది. అర్హులైన నిరుపేదలకు అందాల్సిన ఇళ్లు, పైరవీకారుల చేతుల్లోకి వెళ్తుంటే పాలక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, బుధవారం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశం వేదికగా 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.

**పేదల పక్షాన గళమెత్తిన దండు సారయ్య:**

తన వార్డు ప్రజల సమస్యలను కేవలం సమావేశాల్లో మొక్కుబడిగా చెప్పడం కాకుండా, ఆధారాలతో సహా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందు ఉంచారు కౌన్సిలర్ దండు సారయ్య. 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న భారీ మోసాలను, మధ్యవర్తుల ఆగడాలను ఆయన ఎండగట్టారు. "అర్హత ఉన్న పేదవాడు ఆఫీసుల చుట్టూ తిరుగుతుంటే, అనర్హులు అక్రమ మార్గాల్లో ఇళ్లను ఎలా దక్కించుకుంటున్నారు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేవలం ఇళ్ల సమస్యే కాకుండా, కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న నరకప్రాయమైన సమస్యలను వివరిస్తూ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

**వ్యవస్థను ప్రశ్నిస్తున్న 'సారయ్య' పోరాటం:**

ప్రజా ప్రతినిధులు అంటే కేవలం రిబ్బన్లు కట్ చేయడానికో, ఫొటోలకు ఫోజులివ్వడానికో పరిమితం కాకుండా, ప్రజల కన్నీళ్లకు జవాబుదారీగా ఉండాలని దండు సారయ్య నిరూపించారు. సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి పర్యటనలో ఉన్నప్పటికీ, ఏమాత్రం వెనుకాడకుండా తన వార్డు ప్రజల బాధను గంభీరంగా వినిపించి అధికారుల తీరును తూర్పారబట్టారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, కనీస వసతులు లేక ప్రజలు దుర్భర జీవితాన్ని గడుపుతుంటే అధికారులు ఏ నివేదికలు ఇస్తున్నారని ఆయన ప్రశ్నించడం అక్కడున్న వారిని ఆలోచనలో పడేసింది.

**మంత్రి హామీ.. ఆచరణలో చూస్తామా?**

దండు సారయ్య తెగువకు, ఆయన వినిపించిన ప్రజా గోడుకు స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, ఈ హామీలు కేవలం సమావేశాలకే పరిమితం అవుతాయా లేక 13వ వార్డు పేదలకు న్యాయం జరుగుతుందా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఏది ఏమైనా, అధికార మదం గొంతు నొక్కాలని చూస్తున్నా, పేదల పక్షాన గొంతు ఎత్తిన దండు సారయ్య కృషిని ఇల్లందు ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు. అక్రమార్కుల ఆట కట్టించే వరకు, అర్హులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని కౌన్సిలర్ స్పష్టం చేయడం విశేషం.

# హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం




- బారాసపై బురద చల్లడానికి రేవంత్ రెడ్డి ఆడిన డ్రామాలు వెలుగు చూశాయి
- ఇప్పటికైనా వాస్తవాలు మాట్లాడండి
- కాంగ్రెస్ పెద్దలకు మాజీ మంత్రి హరీష్ రావు కౌంటర్

తెలంగాణ మేడిగడ్డ/ఏప్రిల్22/(జన సంఘర్షణ)

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తప్పుడు ప్రచారం చేశారు అంటూ మాజీ మంత్రి, బారాస సీనియర్ నాయకులు హరీష్ రావు ఆరోపించారు. హైకోర్టు తీర్పుతో రేవంత్ రెడ్డి డ్రామాలు వెలుగులోకి వచ్చాయి అంటూ హరీష్ రావు గుర్తు చేశారు .మేడిగడ్డ పిల్లర్ల మర్మమతులు పూర్తి చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసంఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా, అప్పటి ప్రభుత్వ పెద్దలు సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని, తెలంగాణ హైకోర్టు ఆదేశిస్తూ కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. పీసీ ఘోష్ కమిషన్ ని హైకోర్టు స్టేను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు స్వాగతించారు.. కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు చెప్పింది. హైకోర్టు తీర్పుతో ధర్మం గెలిచింది అంటూ హరీష్ రావు వ్యాఖ్యానించారు.. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్పై బురద జల్లే ప్రయత్నం చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేశారని హరీష్ రావు ఆరోపించారు.. రేవంత్ రెడ్డి డ్రామాలు వెలుగులోకి వచ్చాయి. మేడిగడ్డ పిల్లర్ల మర్మమతులు పూర్తి చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. కాళేశ్వరం కూలేశ్వరం అయిందని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కన పెట్టి ,డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజ స్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందన్నారు హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు.ఎవరు ఔనన్నా కాదన్నా. ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం.. అని హరీష్ రావు పునరుద్ఘాటించారు.

# మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



- తొలి రోజున ధ్వజారోహణం రాత్రి సింహ వాహనము

చౌడేపల్లి ఏప్రిల్ 22 (జన సంఘర్షణ)

స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 21న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. బుధవారం పద్మశాలి కులస్తులు ఉభయదారులుగా ధ్వజారోహణము రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సింహ వాహనము పై ఉంచి పట్టణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ కులస్తులు ఉబయదారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు కుమారస్వామి మహేష్ స్వాముల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.

## ఎక్లస్పూర్ గ్రామానికి చెందిన షేక్ హైమద్ రెండు గేదెలు ఎవరో గుర్తు తెలియని దొంగిలించారు

కోటగిరిఎక్లస్పూర్/ఏప్రిల్22/(జన సంఘర్షణ)

కేసు యొక్క వివరాలు ఏమనగా ఎక్లస్పూఎక్లస్పూర్ గ్రామానికి చెందిన షేక్ హైమద్ యొక్క రెండు గేదెలు ఎవరో గుర్తు తెలియని దొంగలు తేదిర్ గ్రామానికి చెందిన షేక్ హైమద్ యొక్క రెండు గేదెలు ఎవరో గుర్తు తెలియని దొంగలు తేది 21/22.04.2026 రోజున రాత్రి దొంగలించుకొని వెళ్లారు అని దరఖాస్తు ఇవ్వగ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము. రెండు గేదెల కొమ్ములు చిన్నగా ఉంది వంకరగా ఉంటాయి, ఒక గేదె తలపైన తెల్లగా చిన్న మచ్చ కలదు.

## దిండిగాల రాజేందర్ నేతృత్వంలో ఆమ్ బజార్లో నిర్వహణ

- నాయకులు, కార్యకర్తల సందడి




ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ)

బీఆర్ఎస్ పార్టీ సభ్యురాలు, ఇల్లందు మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతి పుట్టిన రోజు సందర్భంగా ఆమ్ బజార్లోని ఆమె స్వగృహం లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వాతి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్ రంగనాథ్, టౌన్ ప్రెసిడెంట్ అబ్దుల్ జబ్బర్, మండల ఉపాధ్యక్షులు దేరంగుల పోశం తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని స్వాతి గారికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ.. స్వాతి ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ఆదాయ పెంపుతో ఆదర్శంగా సింగరేణి పంచాయతీ

- సర్పంచ్ టోనీకి ఘన సన్మానం
- పన్నుల వసూళ్లలో ప్రతిభ... గ్రామాభివృద్ధికి దారితీసిన చొరవకు అధికారుల ప్రశంసలు





సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ )

కారేపల్లి మండలం కాకతీయ పరిధిలోని సింగరేణి గ్రామపంచాయతీ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ)కు అరుదైన గౌరవం లభించింది. గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంపొందించడంలో చూపిన చొరవకు గాను ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. ఎండోమెంట్‌కు సంబంధించిన వారాంతపు సంత ద్వారా పంచాయతీకి రావాల్సిన పన్నులను సమర్థవంతంగా వసూలు చేయించి, గ్రామ ఖజానాను బలోపేతం చేయడంలో టోనీ కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) తేజావత్ రాంబాబు స్వయంగా సింగరేణి గ్రామాన్ని సందర్శించి, సర్పంచ్ టోనీతో పాటు ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డీపీఓ రాంబాబు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావడం గ్రామాల సమగ్ర అభివృద్ధికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఆదాయాన్ని సక్రమంగా సేకరించడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. సేకరించిన నిధులను గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించి, సింగరేణిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సహకరించిన అధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, సర్పంచ్ వరలక్ష్మి రాజు, బానోత్ పద్మ, రుప్లానాయక్, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఆర్టీసీ కార్మికులు శాంతియుతంగా సమ్మె నిర్వహించాలి



తెలంగాణ నిజామాబాద్ కామారెడ్డి /ఏప్రిల్22/(జన సంఘర్షణ)

నిజామాబాద్,కామారెడ్డి, ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో పోలీసు శాఖ కీలక సూచనలు చేసింది. జిల్లా కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఆర్టీసీ కార్మికులు శాంతియుతంగా సమ్మె నిర్వహించాలని అధికారులు స్పష్టం చేశారు.
సమ్మె సందర్భంగా ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు సమ్మె ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కార్మికులు తమ డిమాండ్లను శాంతియుత మార్గాల్లో తెలియజేయాలని, సహకరించాలని అధికారులు కోరారు.

## తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ నేతల మద్దతు




**పీర్జాదిగూడ :**
ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవ్వడంతో కార్మిక జేఏసీ సమ్మెకు పిలునిచ్చిన నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని ఉప్పల్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి పలు కీలక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. సంస్థ బలోపేతానికి ఆర్థిక సహాయం అందించడం, ఉద్యోగుల జీతాల పెంపు, పెండింగ్ సమస్యల పరిష్కారం, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి చర్యలతో ఆర్టీసీని కాపాడారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని వారు విమర్శించారు. వెంటనే ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలు జరిపి, వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కౌడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, బుల్లెట్ శంకర్, అశోక్ రెడ్డి, సతీష్, శ్రీ రాములు గౌడ్, అశోక్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ గౌడ్, శ్రీకాంత్, అమర్ పటేల్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో పటేల్ కుంట చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి మేరకు హైడ్రా కమిషనర్ హామీ

**ఉప్పల్**
నాచారం డివిజన్లో ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రధాన సమస్యల్లో దోమల సమస్య ఒకటిగా మారింది. నాచారంలోని రెండు చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, వ్యర్థ రసాయన జలాల నిల్వతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి పెరిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే రూ. 30 కోట్ల నిధులతో హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు నిధులు మంజూరు చేయించగా, ఆ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా పటేల్ కుంట చెరువు కూడా పూర్తిగా గుర్రపుడెక్క, పూడికతో నిండిపోవడంతో ఆ చెరువును కూడా సుందరీకరించాలని ఎమ్మెల్యే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి విన్నవించారు. చిన్న చెరువు కావడంతో తక్కువ వ్యయంతోనే పనులు పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, త్వరలోనే పటేల్ కుంట చెరువు సుందరీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చెరువుల అభివృద్ధి, పరిసరాల పరిరక్షణకు చర్యలు వేగవంతం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదిక కి రైతుల ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ ఫ్రిజ్ వితరణ



**అన్నపురెడ్డిపల్లి /ప్రజావారధి:**
మండలంలో మర్రిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రైతుల ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి రైతు వేదిక కి కూలింగ్ వాటర్ ఫ్రిజ్ వితరణ ఇవ్వడం జరిగింది, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్టి లో పెట్టుకొని ఫ్రిజ్ వితరణ ఇవ్వడం చాలా మందికి ప్రయోజనం ఉంటుంది మర్రిగూడెం గ్రామ రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి గాలం కాటమరాజు, స్థానిక రైతులు చక్కటి సోమరాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి

**కార్మికుల డిమాండ్లను అంగీకరించి సమస్యలను పరిష్కరించాలి**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**మహబూబాబాద్ :**
ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, ఈ విషయంలో సమ్మె పై ముఖ్య మంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ సిపిఐ జిల్లా సమితి సమావేశం కట్టబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక వీరభవన్ లో బుధవారం జరిగింది. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ఎన్నికల హామీమేరకు ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన రెండు వేతన సవరణల ను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యం అని, సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రైవేటు డ్రైవర్ల ప్రయోగం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని, సమ్మెను అణచివేసేందుకు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ అచేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి సహాయ కార్యదర్శు లు బి అజయ్ సారథి రెడ్డి, నల్లుసుధాకర్ రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు, చొప్పరి శేఖర్, తండ సందీప్ , జంపాల వెంకన్న పోలెపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు,

## హబ్సిగూడలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి






**ఉప్పల్ :**
హబ్సిగూడ మెయిన్ రోడ్లో ఓల్డ్ పెట్రోల్ బంక్ సమీపంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కాలేరు జై నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎండల కాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు అధికమవుతాయని, అలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ చల్లని త్రాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, ప్రయాణికులు, వృద్ధులు, రోడ్డుపై ప్రయా ణించే ప్రజలకు ఈ చలివేం ద్రం ఉపశమనాన్ని కలిగి స్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచు కుని పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహ కులకు సూచించారు. భవిష్యత్తులో కూడా నియోజ కవర్గంలోని మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్ర మాలు చేపట్టి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేస్తా మని హామీ ఇచ్చారు. వేసవి కాలంలో ప్రజలకు చల్లని నీరు అందించే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని స్థానికులు కోరు తున్నారు. ఈ కార్యక్రమంలో పసుల ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ లక్ష్మీనారాయణ, రజిత రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మనోహర్, సంజయ్ జెన్, లింగ నాయక్, రవి నాయక్, కిషోర్ నాయక్, మొహమ్మద్ రహ్మాన్, కైసర్, ఎ ాని, రవి ప్రసాద్, మహేందర్, సందీప్, పైసల్ బాబు, మహేందర్ నాయక్, శృతి కుటుంబ సభ్యులు, కాలేరు సురేందర్, కాలేరు ప్రణతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్లో చలివేంద్రం ప్రారంభం

**చలివేంద్రం ప్రారంభించిన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్**

**ప్రజల దాహం తీర్చే సేవా కార్యక్రమం**






**సుజాతనగర్**
కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్లో ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే చలివేంద్రం కేంద్రాన్ని కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహం తీర్చే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి , 22వ డివిజన్ కార్పొరేటర్ లింగం పుష్పవతి, అలాగే సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మూడు గణేష్ మాట్లాడుతూ, సుజాతనగర్ సెంటర్ ప్రాంతం రోజూ వందలాది మంది రాకపోకలు జరిగే ప్రదేశమని, ఇలాంటి ప్రాంతాల్లో చలివేంద్రం ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అనేకమంది ప్రజలకు తాగునీరు అందించి వారి దాహాన్ని తీర్చడమే లక్ష్యమని చెప్పారు. ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన స్వయంగా ఒక గ్లాసు నీటిని మరొకరికి అందిస్తూ, "ఇకనుంచి ఈ చలివేంద్రం మనందరి దాహాన్ని తీర్చే సేవా కేంద్రంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని, వేసవి కాలంలో ఇది ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ప్రజలలో సేవాభావాన్ని పెంపొందించే విధంగా సాగగా, స్థానికులు ఈ చలివేంద్ర ఏర్పాటును అభినందించారు.

## కిసరి వారి వివాహ వేడుకకు హాజరైన సున్నం లలిత

**అశ్వరావుపేట :**
అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలోని రాచురుపల్లి గ్రామంలో కీసరి నాగేశ్వరరావు,(లేటు) వెంకట నరసమ్మ,దంపతుల కుమారుడైన ప్రేమ్ సాగర్, ప్రవల్లిక,పరిశుద్ధ వివాహంనకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ అశ్వరావుపేట నియోజకవర్గం నాయకురాలు అన్నపురెడ్డిపల్లి మాజీ ఎంపీపీ సున్నం లలిత, ఈ కార్యక్రమంలో మల్లాయిగూడెం మాజీ సర్పంచ్ యువ నాయకులు నారం రాజశేఖర్, (టీచర్) జార నాగరాజు, కిసరి వెంకటస్వామి, సవలం నరసింహారావు, తుర్రం ప్రసాద్, ధనరాజు, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
23 ఏప్రిల్ 2026

# రైతుల గోడు పట్టించుకునేది ఎవరు?

**-ఇందుగుల ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలువు దోపిడీ**

**-క్వింటాకు 4--6 కిలోల అక్రమ కోత పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యం**

**-ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు**



**మాడుగులపల్లి:**
మండలంలోని ఇందుగుల గ్రామం తిప్పర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలు పెరిగినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతుల వద్ద ఒక్కో క్వింటాకు 4 నుండి 6 కిలోల వరకు అక్రమంగా కోత విధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తూకాల మోసాల వల్ల తమకు గణనీయమైన నష్టం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉన్నప్పటికీ పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అక్రమాలు జరుగుతున్నాయని వారు మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి సరైన ధర దక్కకపోగా, తూకాల్లో మోసాలు జరుగుతుండటంతో అప్పుల పాలవుతున్నామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇందుగుల కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. విధులకు గైర్హాజరవుతున్న పీఏసీఎస్ సిబ్బందిపై, తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పేదోళ్ల ఇళ్ల పట్టాలకై పడిగాపులు



**రామగుండం,ఏప్రిల్ 22**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో మంద కొమరమ్మ కాలనీ ఇండ్ల పట్టాల కొరకై చేపట్టిన దీక్షలు 12వ రోజుకు చేరుకు న్నాయి.ఈ దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మడిపల్లి దశరథం మాట్లా డుతూ గత తొమ్మిది సంవత్సరాల కాలం నుండి పోరాడుతున్నటువంటి దళితులు రోజువారి కూలీలు ఉండడానికి సొంత ఇల్లు లేక కిరాయిలు కట్టలేక దినదిన గండంగా బతికీడుస్తున్న నిరుపేదలను కనికరించి వీరికి సొంత ఇల్లు కళ నెరవేర్చే విధంగా ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం వీరిని కనికరించకపోగా,కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మా కల సాకారం అవుతుందని ఇందిరమ్మ రాజ్యంలో మాకు ఒక గూడు దొరుకు తుందని ఆశించిన దళితుల కలనెరవేరలేదని పేదలైనటువంటి వారికి న్యాయం చేయకపోతే ఈ ఉద్యమాన్ని ఇండ్ల పట్టాలు ఇచ్చేంతవరకు ఆపేది లేదని ఆయన తెలిపారు.ఈ కార్య క్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద రవికుమార్,కన్నూరి ధర్మేందర్,పల్లె బాబు,రాచపల్లి రవి,కాసిపేట రాజయ్య,రాచర్ల రాజేశం,కాజీపేట సదానందం,ఇదినూరి కొమురయ్య, కాలనీవాసులు,రెంటాల రాధా,అంబాల అర్చన,అడ్లూరి అంజలి,సుగుణ,పౌల్, కొమురయ్య, గౌరీ,సరోజన అరుణ,సుజాత,సారమ్మ,సుజాత నర్సమ్మ,పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒకరికి 3 రోజుల జైలు శిక్ష

**రామగుండం,ఏప్రిల్ 22**



రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్&డ్రైవ్ లో దొరికిన ముగ్గు రికి సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ ముందు హాజరు పరుచగా ఇద్దరికి 4000/- జరిమానా విధించారు.ఒక వ్యక్తి రెం డవసారి పట్టుబడగా 3 రోజుల జైలు శిక్ష విధిం చారు. వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది.ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడప రాదని,నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగు తుందని,వాహనానికి సంబంధించిన పత్రములు మరియు టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని,రాంగ్ రూట్లో వెళ్లరాదని ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని,వాహనాన్ని అతివేగంగా నడపరాదని సిఐ తెలియజేశారు.

# పదవి విరమణ మహోత్సవం

**పాల్గొన్న అన్ని టీచర్స్ సంఘాల నాయకులు**

**తుంగారం స్కూల్లో కార్యక్రమం**



**చంద్రుగొండ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తుంగారం లో గల ఎంపీపీ ఎస్ స్కూల్ లో ఉపాధ్యాయునిగా పనిచేసి పదవి కాలం ముగియడంతో పదవి విరమణ చేసిన వై నరసింహ చారి, సన్మాన సభ తుంగారంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆడిట్ కమిటీ ఎస్ వెంకటేశ్వర్లు, మండలంలోని అన్ని సంఘాల మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ఆయన కు శుభాకాంక్షలు తెలిపారు.ఆర్ వీరన్న, ఇస్లావత్ వీరన్న, లక్ష్మణ్, రామకృష్ణ, ఎం వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి సూర్యం, మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ అన్ని కాంప్లెక్స్ హెడ్మాస్టర్స్ వెంకటరెడ్డి, రామచంద్ర, రేపలవాడ పాఠశాలలోని ఉపాధ్యాయ ఉపాధ్యాయులందరూ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు నరసింహచారి, బంధుమిత్రులు భారీగా పాల్గొన్నారు. అలాగే అన్ని కాంప్లెక్స్ ల సెక్రటరీస్ రమేష్, శ్రీరాములు, రామకృష్ణ, వీరన్న, కిరణ్, రవి, శంకర్, విజయమ్మ, సుధారాణి, సూర్యం, రవీంద్రబాబు, వీరభద్రం, గుగులోతు సురేష్, భూక్య చందులాల్, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి



**మాడుగుల:**
కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడుగుల మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలానికి చెందిన 225 మంది లబ్ధిదారులకు ఈ సందర్భంగా చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెళ్లి జరిగిన తర్వాత చాలా కాలం ఆలస్యంగా కల్యాణ లక్ష్మి చెక్కులు అందేవని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల లోపే చెక్కులు అందజేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన లోపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా సరిదిద్దుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల రైతు బంధు నిధులను కూడా విడుదల చేశారని గుర్తుచేశారు.మాడుగుల గ్రామానికి భూగర్భ మురుగునీటి వ్యవస్థ కోసం 7 కోట్ల 50 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అలాగే మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రహదారులు, భూగర్భ మురుగునీటి నిర్మాణాలకు 9 కోట్ల 9 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.మండల తహసీల్దార్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో మాడుగుల సర్పంచ్ రజిత దేవేందర్ గౌడ్, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భట్టు కిషన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొండలు రెడ్డి,ప్రజాప్రతినిధులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో రావాలి

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి తిరుగు ఉండదు**

**మంత్రి తుమ్మల,ఎమ్మెల్యే జారె**





**అశ్వరావుపేట :**
రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, కో-ఆపరేటివ్, చేనేత అనుబంధ సంస్థల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ, బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలంలోని కమలాపురం, తొట్టిపంపు గ్రామాలలో సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువలను పరిశీలించారు. ప్రాజెక్ట్ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించారు. అదేవిధం గా సత్తుపల్లి నియోజకవర్గం యాతాలకుంట లిఫ్ట్ ఇరిగేషన్ కేంద్రాన్ని సందర్శించి సత్తుపల్లి ట్రంక్ కెనాల్ కాలువ పనుల ప్రస్తుత స్థితిని సమీక్షించారు. పనులు సమయానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# డ్రాయింగ్ పోటిలో గురుకుల విద్యార్థినికి ప్రథమ బహుమతి

**రామగుండం,ఏప్రిల్ 22 , :**
పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏప్రిల్ 21న తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖల విద్యార్థుల ప్రతిభ ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డ్రాయింగ్ పోటిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల బాలికలు పాల్గొన్నారు. రామగుండంకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఏ.వర్షిని ప్రథమ బహుమతి సాధించిన సందర్భంగా విద్యార్థిని ప్రతిభను డిఈఓ,ప్రిన్సిపాల్ మాధవి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co